
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 7 జూలై 2024 | 5



నేడు సాహితీ స్రవంతి సభ 8లో
రేపు పిఠాపురంలో 8లో
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక
10న మండల కేంద్రాల్లో ఆందోళనలు 8లో
కార్యదర్శులపై కమిషనర్ అసహనం 8లో



పోర్టు భూములు

'అప్పు'డంతే.. తాకట్టంతే!

- పోర్టు భూముల తాకట్టుపై ఏం చేస్తారో
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడపోర్టు భూముల తాకట్టు
- 388 ఎకరాలను కుదువపెట్టి రూ.1500కోట్ల రుణం తెచ్చి మళ్లించేసిన జగన్
- పోర్టు భవిష్యత్తు అవసరాలను పట్టించుకోకుండా అడ్డగోలు నిర్ణయం
- ఒకపక్క పూర్తిస్థాయి ఆధునికీకరణ లేక ఈసురోమంటున్న రేవు
- ఇది కాక పేదల ఇళ్లస్థలాల పేరుతో వందెకరాలు బలవంతంగా లాక్కున్న ప్రభుత్వం
- భూములు ఇవ్వడానికి కుదరదని పోర్టు అప్పట్లో వ్యతిరేకించినా ససేమిరా
- తాజాగా వీటన్నింటినీ కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు
- తాకట్టు భూములపై కూటమి సర్కారు ఏ నిర్ణయం తీసుకుంటుందోనని చర్చ
- త్వరలో విడుదల చేయనున్న శ్వేతపత్రంలోను ఈ వ్యవహారం ప్రస్తావించే అవకాశం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అడ్డగోలు అప్పుల కోసం కాకినాడ పోర్టు భూములను గత వైసీపీ ప్రభుత్వం తాకట్టు పెట్టేసిన తీరు తాజాగా కొత్త ప్రభుత్వాన్ని కళ్లు తేలేసేలా చేస్తున్నాయి. గడచిన అయిదేళ్లలో జగన్ సాగించిన ఆర్థిక విధ్వంసంపై ఒక్కోటి ఆరా తీస్తున్న అధికారులకు కాకినాడ పోర్టు భూముల తాకట్టు వ్యవహారం విస్మయానికి గురిచేస్తోంది. 388 ఎకరాలను తాకట్టుపెట్టి రూ.1500కోట్లు అప్పుతెచ్చి ఆ నిధులను వేరే అవసరాలకు దారిమళ్లించేసిన వైనం కళ్లు బైర్లు కమ్మేలా చేస్తోంది. ఈ నిధులతో పోర్టును బాగు చేయకుండా హార్బర్‌ను పూర్తిచేయకుండా దారి మళ్లించేసింది. ఈ నేపథ్యంలో ఈ అడ్డగోలు వ్యవహారంపై ఏం చేయాలనే దానిపై ఇప్పుడు కొత్త ప్రభుత్వం తలపట్టుకుంటోంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన గత వైసీపీ పాలనతీరును త్వరలో శ్వేతపత్రం రూపంలో ఎండగట్టేందుకు సీఎం చంద్రబాబు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో అప్పుల కుప్పల లెక్కలను తవ్వుతున్న తరుణంలో కాకినాడ పోర్టు భూముల తాకట్టు వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో దీనిపై సీఎం చంద్రబాబు ఏం నిర్ణయం తీసుకుంటుందోననేది ఆసక్తికరంగా మారింది.

ఏకంగా తాకట్టు పెట్టేశారు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వ్యవస్థలను అభివృద్ధి చేయడం మాటేమోగానీ వాటి ఆస్తులను తాకట్టుపెట్టేయడం రివాజుగా మారింది. వీటి ఆస్తులను తాకట్టుపెట్టేసి అప్పుల దాహం అడ్డగోలుగా తీర్చుకుంది. దీనికి నిలువెత్తు నిదర్శనమే కాకినాడ యాంకరేజ్ పోర్టు వ్యవహారం. రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఈ ఓడరేవు నుంచి నెలనెలా విదేశాలకు లక్షల టన్నుల్లో బియ్యం ఎగుమతి అవుతాయి. ఇతర పోర్టులకు కార్గో కొరత ఉంటుందేమోగానీ, కాకినాడ పోర్టుకు మాత్రం ఆ బెడద లేదు. ఆదాయంలోను దీనికి తిరుగులేని పరిస్థితి. రద్దీ ఎక్కువగా ఉన్న ఈ పోర్టును ఆధునికీకరిస్తే ఎగుమతుల్లో వేగం పెరుగుతుంది. కానీ గత జగన్ ప్రభుత్వం దీన్ని పూర్తిగా పక్కన పడేసింది. పోర్టు ఆధునికీకరణకు నోచుకోక అత్యంత సాంప్రదాయ పద్ధతుల్లో ఇక్కడి నుంచి బియ్యం ఎగుమతులు అలస్యంగా జరుగుతున్నాయి. వాస్తవానికి ఇతర ఓడరేవులకు నేరుగా నౌకలు బెర్త్‌కు వస్తుంటే యాంకరేజ్ పోర్టులో మాత్రం డ్రెడ్జింగ్ లేక నౌకలు సముద్రం మధ్యలో ఆగిపోతున్నాయి. అక్కడికి లక్షల టన్నుల బియ్యాన్ని బార్జిల్లో తీసుకువెళ్లి నౌకల్లోకి లోడింగ్ చేస్తారు. దీంతో రవాణా చాలా ఆలస్యమవుతోంది. అయితే ఈకష్టాలను గత జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు సరికదా దీనికున్న రెండు వేల ఎకరాల సొంత భూములపై కన్నేసింది. అప్పులు ఎక్కడా పుట్టకపోవడంతో అనేక ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టేసిన గత ప్రభుత్వం చివరకు కాకినాడ పోర్టు భూములను కూడా వదల్లేదు. వీటిలో కాకినాడ నగరానికి సమీపంలో ఉన్న అత్యంత విలువైన 388 ఎకరాలను ఏకంగా బ్యాంకుకు తాకట్టు పెట్టేసింది. 2022 డిసెంబరులో ఏపీ మారిటైం బోర్డు ద్వారా బలవంతంగా లాగేసుకుని ఎస్‌బీఐ క్యాప్‌కు తాకట్టు పెట్టేసింది. తద్వారా గుట్టుగా రూ.1500కోట్ల రుణం తీసుకుంది. ఈ నిధులను పోనీ కాకినా యాంకరేజ్ పోర్టు అభివృద్ధి కోసం వాడితే పోనీలే అనుకోవచ్చు. కానీ ఎక్కడో రామాయపట్నం ఓడరేవు నిర్మాణానికి రూ.700కోట్లు, మచిలిపట్నం పోర్టుకు రూ.550కోట్లు, భావనపాడు పోర్టుకు రూ.250 కోట్లు చొప్పున నిధులు మళ్లించేసింది. అయితే ఈనిధులైనా వాటికి పూర్తిగా అందాయా అంటే లేదనే సమాధానం చెప్పాలి. ఇతర అవసరాలకు వాటి పేరుతో ఈనిధులు మళ్లించేసింది.

సాధారణంగా ఎక్క డైనా ఓడరేవును అభివృద్ధి చేయాలంటే దాని పేరుపైన, దానికి ఉన్న స్థిరాస్తుల పైన ప్రభుత్వాలు అప్పు తెస్తాయి. దానికి విరుద్ధంగా కాకి నాడ పోర్టు భూములను తాకట్టు పెట్టి వేరే పోర్టుల అభివృద్ధి పేరుతో వాడేసుకోవడం అప్పట్లో తీవ్ర దుమారం రేపింది. పైగా తీసుకున్న రూ.1500కోట్ల రుణాన్ని 13ఏళ్ల తర్వాత తీర్చుతామని రుణ ఒప్పందం లో మారిటైం బోర్డు పేర్కొంది. ఈ రుణం డబ్బులు తిరిగి యాంకరేజ్ పోర్టు నెత్తిన రుద్దేసింది. కాకినాడ యాంకరేజ్ పోర్టుకున్న రెండు వేల ఎకరాలపై గత ప్రభుత్వాలు ఎప్పుడూ కన్నేయలేదు. కానీ గత వైసీపీ ప్రభుత్వం మాత్రం 2020 నుంచీ వీటిపై కన్నేసింది. తనకున్న ప్రతి అవసరానికీ ఈభూములు లాగేసుకోవడమే పనిగా పెట్టుకుంది. పేదల ఇళ్ల స్థలాలకు భూములు లేవనే సాకుతో దుమ్ములపేట సమీపంలో వందెకరాల పోర్టు భూములు లాగేసుకుంది. తాము ఇవ్వమని పోర్టు డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాసినా సర్కారు వినిపించుకోలేదు. నిషేధిత జాబితా నుంచి భూములను తప్పించి బలవంతంగా అప్పటి కలెక్టర్ ద్వారా తీసేసుకున్నారు. ఇలా యాంకరేజ్ పోర్టు భూములతో గత ప్రభుత్వం దారుణంగా చెలగాటం ఆడింది.

ఏం చేస్తారో...

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో గత ప్రభుత్వ పాతకాలను తవ్వుతోంది. ప్రధానంగా అప్పుల పేరుతో పాల్పడిన అరాచకాలపై దృష్టిసారించింది. దీనికి సంబంధించి రాష్ట్రాన్ని ఏవిధంగా అప్పుల ఊబిలోకి గత ప్రభుత్వం నెట్టేసిందో త్వరలో శ్వేతపత్రం కూడా విడుదల చేయబోతోంది. ఈనేపథ్యంలో కాకినాడపోర్టు భూముల తాకట్టు అంశంపైనా అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలో ప్రకటించనున్న శ్వేతపత్రంలో ప్రభుత్వ ఆస్తుల తాకట్టు ఎక్కడెక్కడ ఎలా చేశారనేదానిపైనా సీఎం చంద్రబాబు బయటపెట్టనున్నారు. ప్రధానంగా తాకట్టు జాబితాలో విశాఖ కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్, విశాఖ సీపీ కార్యాలయాలున్నాయి. వీటిని తాకట్టుపెట్టి అప్పట్లో వేల కోట్లు అప్పులు తెచ్చారు. ఆతర్వాత అవి చాలవన్నట్లు కాకినాడ యాంకరేంజ్ పోర్టు భూములను కుదువపెట్టారు. పైగా ఈ 388ఎకరాలను 13ఏళ్లకు తాకట్టుపెట్టడంతో ఇప్పుడు యాంకరేజ్ పోర్టు భవిష్యత్తు ఏంటనేది చర్చనీయాంశంగా మారింది. తెచ్చిన రూ.1500 కోట్ల అప్పు తీర్చడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. అటు యాంకరేజ్‌పోర్టు భూములను తాకట్టునుంచి విడిపించడం కూడా ఇప్పుడు సవాలే అని చెప్పాలి. తాకట్టులో ఉన్నందున ఈభూముల్లో పోర్టు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టే పరిస్థితి లేదు. ఈనేపథ్యంలో ప్రత్యామ్నాయంగా కొత్త పోర్టుల అభివృద్ధి ద్వారా తాకట్టు అప్పును ఎలా తీర్చే అవకాశం ఉందనేది సీఎం చంద్రబాబు అధికారులతో చర్చించే అవకాశం ఉంది.

జాడలేని వానలు

- వేసవిని తలపిస్తున్న ఎండలు.. ఉక్కబోత
- ఆకుకోతలపై సందిగ్ధంలో అన్నదాతలు
- మండలాల్లో నత్తనడకన వరినాట్లు
- ఖరీఫ్ సీజన్ మరింత ఆలస్యం



కిర్లంపూడిలోని పొలంలో వరినాట్లు నాటుతున్న రైతులు

కిర్లంపూడి, జూలై 6: గతేడాది ఖరీఫ్‌లో నెలకొన్న పరిస్థితులే ఈ ఏడాది కూడా పునరావృతమవుతున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సీజన్ మరింత ఆలస్యమవుతోంది. జూన్ నెలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురవడంతోపాటు జూలై మొదటివారం ప్రారంభమైనా పెద్దగా వర్షాలు జాడలేకపోవడంతో అన్నదాతలు వేచిచూసే ధోరణిలో ఉన్నారు. అదే సమయంలో ఎండాకాలాన్ని తలపించేలా ఎండలు కాయడం.. ఉక్కపోతతో రైతులు ఆకుకోతలు కోసే సమయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అక్కడక్కడ చెరువుల కింద సాగయ్యే భూముల్లో విత్తనాలు చల్లినా మిగిలినచోట్ల ఆకుకోతలు ప్రారంభంకాలేదు. గతేడాది జూన్, జూలై నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవగా ఆగస్టు రెండోవారం వరకు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో గత ఖరీఫ్‌లో వరిసాగు మందకొడిగానే సాగింది. ఏటా జూలై రెండోవారానికే చాలాచోట్ల వరినాట్లు ప్రారంభమై ఆగస్టు నెలాఖరుకు 80శాతం పైగానికి వరినాట్లు పూర్తికావాల్సి ఉండగా గతేడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పలు మండలాల్లో వరినాట్లు కంటే 40శాతం మేర మాత్రమే పడ్డాయి. సీజన్ పూర్తయ్యేసరికి సాధారణ వరి విస్తీర్ణం కంటే తక్కువ పడ్డాయి. ఈ ఏడాదిలో ఖరీఫ్ సీజన్‌లో సైతం గతేడాది పరిస్థితులే కనిపిస్తున్నాయని అన్నదాతలు అంటున్నారు. వాస్తవానికి జూన్ నెలాఖరు నుంచే చాలా చోట్ల ఆకుమడులు తయారు చేసి విత్తనాలు జల్లే ప్రక్రియ ప్రారంభమవుతుంది. చెరువుల పరిధిలోను మరికొంత ముందుగానే విత్తనాలు జల్లుతున్నారు. ఈఏడాది జూన్‌లో వర్షాలు జాడలేక ఎండలు ఎక్కువగా ఉండడంతో విత్తనాలు జల్లడంతోపాటు చెరకు, దవ్వ, ఊడ్పులు చాలా చోట్ల ప్రారంభంకాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల అక్కడక్కడా వర్షాలు పడినా అవి సాగు అవసరాలకు సరిపడ స్థాయిలో కురవకపోగా ఎండలు తగ్గకపోవడంతో అన్నదాతలు డైలమాలో పడ్డారు. మరికొన్ని గ్రామాల్లో ఆకుమడులు సిద్ధం చేసుకున్నా విత్తనాలు జల్లుకున్నాక వర్షాలు కురవకపోతే పరిస్థితి ఏంటని రైతులు ఆలోచిస్తున్నారు. పలుచోట్ల వర్షపాతం లోటువల్ల ఆకుమడులు తక్కువగా ఉన్నాయి. వర్షాలు కురిస్తే నాట్లు మొదలయ్యే అవకాశాలున్నాయి.

లోవకొత్తూరు శివారులో క్షుద్ర పూజలు? 7లో
శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ 7లో
అన్నవరంలో జాతీయ రహదారిపై ప్రసాద విక్రయ కేంద్రం 7లో

ఇసుక.. ఇక చౌకేనా?

- వైసీపీ హయాంలో కృత్రిమ కొరత.. ఆపై ధర కూడా ఎక్కువే
- కునారిల్లిన నిర్మాణ రంగం, అనుబంధ రంగాలు
- ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు
- రవాణా, లోడింగ్, లేబర్ చార్జీలతో సరఫరా.. రేపటినుంచి కొత్త పాలసీ



సామర్లకోట, జూలై 6: ఇక పేదలకు ఇసుక చౌకగా లభించనుంది. రవాణా, లోడింగ్, లేబర్ చార్జీలతో ఇసుక పేదల దరిచేరనుంది. దీంతో గత వైసీపీ ప్రభుత్వం ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించడంతో పక్కనే ఉన్నా ఇసుక ధరలు ఆకాశాన్నంటాయి. దీనివల్ల నిర్మాణరంగంతోపాటు అనుబంధ రంగాలు కునారిల్లాయి. భవననిర్మాణ రంగాల కార్మికులకు పనులు లేక పస్తులు గడిపారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఈనెల 8నుంచి ఉచిత ఇసుక పాలసీ తీసుకురానుండడంతో కునారిల్లిన నిర్మాణ రంగంతోపాటు దాని అనుబంధ రంగాలు జవసత్వాలు పురుడు పోసుకోనున్నాయి.

వైసీపీ హయాంలో జిల్లాలో ఇసుక దందా కొనసాగింది. నూతన వెంచర్స్ పేరిట వైసీపీ ప్రభుత్వం కొందరి పెద్దలను తెరపైకి తీసుకువచ్చి ఇసుకను అక్రమంగా రవాణా చేసి వైసీపీ నాయకులు కోట్లు దండుకున్నారు. దీంతో నిర్మాణ రంగం కుదేలయ్యింది. దీని ప్రభావం సిమెంట్, స్టీల్, ఇటుక వంటి అనుబంధ రంగాలపైనా పడింది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఒకే సంస్థకు ఇసుక కాంట్రాక్ట్ ఇచ్చారు. వీరు ఇసుకను తవ్వడంలో నిబంధనలను ఉల్లంఘించారు. జిల్లాలో చాలాచోట్ల వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ ఇసుకను అక్రమంగా పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ములు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా..

ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారం చేపట్టిన ఎన్డీఏ కూటమి ఇచ్చిన ఉచిత ఇసుక హామీ నెరవేర్చేదిశగా అడుగులు ప్రారంభించింది. ఈనెల 8 నుంచి ఉచిత ఇసుక పాలసీని తీసుకురానున్నట్లు ప్రభుత్వ పెద్దలు వెల్లడించారు. రవాణా, లోడింగ్, లేబర్‌చార్జీలు భరిస్తే సరిపోతుందని అధికారులు చెప్తున్నారు. దీంతో ఇసుక కష్టాలు తీరుతాయని భవన నిర్మాణ కార్మికులు, సామాన్యులు భావిస్తున్నారు. ఇసుక చౌకగా, అందుబాటులోకి వస్తే ఇన్నాళ్లూ కుదేలైన భవన నిర్మాణ రంగం తిరిగి ఊపందుకోనుంది.

నాడు తాడేపల్లికి.. నేడు పేదవారికి..

బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించేందుకు 2016లో చంద్రబాబు ప్రభుత్వం ఇసుకను ఉచితం చేసింది. అప్పట్లో చంద్రబాబు నిర్ణయంతో అందరికీ ఇసుక చౌకగా లభించేది. తదనంతరం జగన్ సర్కార్ వచ్చాక ఉచిత ఇసుక విధానానికి తిలోదకాలిచ్చారు. ప్రతినెలా తాడేపల్లికి రూ.20కోట్ల చొప్పున కప్పం కట్టేవారన్న ప్రచారం కూడా ఉంది. మధ్య తరగతి వర్గాలకు 20 మెట్రిక్ టన్నుల లారీ ఇసుకను రూ.35వేలపైనే అమ్మి సొమ్ములు చేసుకున్నారు. పెరిగిన ధరలతో నిర్మాణ రంగం కుదేలైంది. చివరకు గత ప్రభుత్వంలో ఉచిత ఇసుక ఇచ్చినందుకు ప్రభుత్వానికి సీనరేజీ, ఇతర ఫీజుల రూపంలో రూ.270కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు చంద్రబాబుపై సీఐడీతో కేసు పెట్టించారు. ఇప్పుడు చంద్రబాబు టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ ఉచిత ఇసుక విధానం రానుంది. చీకటి అమ్మకాలు ఉండవు. ఈ నిర్ణయంతో ప్రజలకు ఏటా రూ.2వేలకోట్ల మేర లబ్ధి జరగనుందని అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. జిల్లాలో ఏలేరు పరీవాహక ప్రాంతం పొడవునా నాణ్యమైన ఇసుక అందుబాటులో ఉంది. ఐదేళ్లుగా కునారిల్లుతున్న నిర్మాణరంగం మళ్లీ ఊపందుకుంటుందని భవననిర్మాణ రంగ కార్మికులు హర్షాతిరేఖాలు వ్యక్తం చేస్తున్నారు.

8నుంచి ఉచిత ఇసుక విధానం అమలుకు పటిష్ట చర్యలు: కలెక్టర్

కలెక్టరేట్/సర్పవరం జంక్షన్, జూలై 6: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 8 నుంచి ఉచిత ఇసుక పంపిణీ విధానం ప్రారంభించాలని, ఇసుక సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 8వతేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు రవాణాకు ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. పెద్దాపురం స్టాక్ పాయింట్ వద్ద ఇసుక రూ.655గా నిర్ణయించామని, స్టాక్ పాయింట్‌నుంచి వినియోగదారుడు రవాణాచార్జీలు భరించి తీసుకెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఇసుక సరఫరాలో అక్రమాలు జరగకుండా స్టాక్ పాయింట్ల వద్ద రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులు ఉండి పర్యవేక్షించాలని, ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇసుకకోసం వినియోగదారుడు ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లింపులు చేయాలని, ముందుగా వచ్చిన ఆర్డర్ ప్రకారం వారికే ఇసుక ప్రాధాన్య క్రమంలో సరఫరా చేయాలన్నారు. అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలను బట్టి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్‌లతోపాటు కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించి అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక రవాణాకు అవసరమైన ఇంటర్నల్, కన్స్యూమర్ పర్మిట్ల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముందుగా శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయంనుంచి నూతన ఇసుక విధానం, స్టాక్ పాయింట్లు, పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ నిర్వహించిన వీసీలో కలెక్టర్‌తోపాటు ఎస్పీ సతీష్‌కుమార్, జిల్లా గనులశాఖ అధికారులతో కలసి హాజరయ్యారు. సమావేశంలో గనులశాఖ డీడీ నరసింహారెడ్డి, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు, ఆర్డీవో మురళీ, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

కాకినాడ రూరల్ జూలై 6: జిల్లాలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్‌ను నియమించినట్లు కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాకు శ్రీకాకుళం జిల్లా డీడీఏ, డీఆర్‌సీ కె.త్రినాథస్వామి, విజిలెన్స్ విభాగంనుంచి డీవీవీ సతీష్‌కుమార్ జిల్లాకు వచ్చారన్నారు. ఈస్క్వాడ్ టీమ్ జిల్లాలో ఐదురోజులపాటు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా చేసి రైతులకు నాణ్యమైన ఎరువులను అందుబాటులో ఉండేలా చేస్తామని తెలిపారు. స్క్వాడ్‌టీమ్ శుక్రవారం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను సందర్శించి ముడిసరుకు వివరాలు, ఉత్పత్తి, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. స్థానిక ఎరువుల దుకాణంలో తనిఖీ చేయగా స్టాక్ రిజిస్టర్‌లో అమ్మోనియం సల్ఫేట్, జింక్ సల్ఫేట్, సూపర్ నమోదు చేయని కారణంగా రూ.4.20లక్షల విలువ చేసే 24.95 మెట్రిక్‌టన్నుల స్టాకు అమ్మకాన్ని నిలిపివేశామన్నారు. శనివారం కరప, కాజులూరు, గొల్లప్రోలు మండలాల్లోని దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి అవకతవకలు లేనట్లు గుర్తించారని తెలిపారు.



కోరమండల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ త్రినాథస్వామి

అక్రమార్కుల్లో టెన్షన్

- ఉపాధి హామీ పథకాల్లో అక్రమాలపై కూటమి నేతల దృష్టి
- సామాజిక తనిఖీలు పద్బంధీగా జరిగేలా కసరత్తులు
- వైసీపీ హయాంలో మొక్కుబడిగా సాగిన వైనం



తుని రూరల్, జూలై 6: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు కళ్లెం వేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు మరింత పదును పెట్టేలా దాని తీరుతెన్నులను కొత్త ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా సమీక్షించడంతో అక్రమార్కులు వణుకుతున్నారు. వాస్తవానికి గత వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకం మొక్కుబడిగా మారింది. అంతకుముందు ప్రభుత్వంలో ఉపాధి నిధులతో చేపట్టిన పనుల్లో లోపాలపై సమగ్రంగా క్షేత్రస్థాయిలో విచారణ చేసి అందులో లోపాలను గుర్తించి వాటిని మండలస్థాయిలో అందరి సమక్షంలో సామాజిక తని ఖీ సమావేశం బహిరంగంగా ఎత్తి చూపించే పరిస్థితి ఉండేది. అక్రమార్కుల బాధ్యు లైన వారి నుంచి స్వాహాకు గురైన సొమ్ము ముక్కుపిండి మరీ వసూలు చేసేలా సామాజిక తనిఖీ వ్యవహారం సాగేది. సామాజిక తనిఖీల్లో ప్రజాప్రతినిధులను ఆహ్వానించి మరీ ఆ విభాగంలో సిబ్బంది క్షేత్రస్థాయి లోపాలను ఎత్తి చూపించేవారు. ఇంతపద్బంధీగా సాగిన సామాజిక తనిఖీ వ్యవహారాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చింది. ఈ వ్యవహారాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని ప్రతిపక్షాలు అప్పట్లో ఫిర్యాదులు చేశాయి. లోపాలు ఎత్తిచూపే సామాజిక తనిఖీ వ్యవహారం వైసీపీ పాలనలో తూతూమంత్రంగా మార్చడంతో తనిఖీ సిబ్బంది, తనిఖీలకు రేట్లు కూడా నిర్ణయించి ఆ మేరకు వసూలు చేసి ఆడిట్ పూర్తి చేసి మమా అనిపించేవారని విమర్శలున్నాయి. పనులను బట్టి పంచాయతీస్థాయిలో ఉపాధి సిబ్బందినుంచి రూ.5వేలపైబడి సామాజిక తనిఖీ వసూలు చేసినట్లు సమాచారం. ఇక ఇంజనీరింగ్ పనులకు సంబంధించి జరిగిన సామాజిక తనిఖీ పనులు దీనికి రెట్టింపుగానే వసూలు చేసినట్లు కూటమి నాయకులు తెలుపుతున్నారు. తుని నియోజకవర్గంలో ఉపాధి పనులకు, చేసిన ఖర్చులకు ఎక్కడా పొంతనలేని విధంగా వ్యవహారం సాగినట్లు సమాచారం. పనులపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో దిగువస్థాయి సిబ్బంది అధికారులదే ఇష్టారాజ్యంగా మారిందని కూటమి నేతలు తెలుపుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సామాజిక తనిఖీలు అంటే మామూళ్లు ఇస్తే సరిపోతుందే అన్న భావన క్షేత్రస్థాయిలో నెలకొందని పలువురు తెలుపుతున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రానున్న సామాజిక తనిఖీలు పగడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- పోలీసు అధికారులకు అవగాహన సమావేశం

కాకినాడ క్రైం, జూలై 6: భారత దేశ క్రిమినల్ చట్టాల్లో చేసిన మార్పులకు అనుగుణంగా నూతనంగా అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశించారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన చట్టాలపై జిల్లా పోలీసు అధికారులకు శనివారం ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన నూతన చట్టాల అమలు, నిర్వహణపై రాజమహేంద్రవరం మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్‌వీ ప్రసాద్, కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాధాకృష్ణంరాజు అవగాహన కల్పించారు. పాత చట్టాలస్థానంలో కొత్త చట్టాల అమలు కోసం తీసుకోవాల్సిన విధి విధానాలపై వివరించారు. కొత్త చట్టాలపై పలువురు పోలీసు అధికారులు లేవనెత్తిన సందేశాలను నివృత్తి చేశారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఎస్పీ ఎస్ఈబీ శ్రీలక్ష్మి, కాకినాడ, పెద్దాపురం ఎస్‌డీపీవోలు కె.హనుమంతరావు, లతాకుమారి, మహిళా పీఎస్ డీఎస్పీ ఆర్.రామచంద్రరావు, ట్రైనీ డీఎస్పీ సాయి ఈశ్వర్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు పీపీ జీఎస్‌వీ ప్రసాద్

వాడపల్లి ఆలయం కిటకిట



ఆత్రేయపురం, జూలై 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.36.62 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్ ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, జూలై 6:మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,17,291 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

విత్తనాలు, ఎరువుల షాపుల్లో తనిఖీలు

గొల్లప్రోలు, జూలై 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల షాపుల్లో వ్యవసాయశాఖ రాష్ట్ర అధికారుల బృందాలు, విజిలెన్స్ అధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. శ్రీకృష్ణా ఏజెన్సీస్, ప్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌ల్లో రికార్డులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలు పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు జరపాలని సూచించారు. తనిఖీల్లో శ్రీకాకుళం వ్యవసాయశాఖ డీడీ కె.త్రినాథస్వామి, విజిలెన్స్ అధికారి డీవీవీ సతీష్‌కుమార్, పిఠాపురం వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, ఏవో కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రసాద విక్రయ కేంద్రం



ప్రసాదాలు విక్రయిస్తున్న సిబ్బంది

అన్నవరం, జూలై 6: జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనదారుల కోసం ఏర్పాటు చేసిన సత్యదేవుడి నమూనాలయం వద్ద ప్రసాదం విక్రయాలను శనివారం నుంచి ప్రారంభించారు. ఈఈ నరసింహారావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం కౌంటర్ ప్రారంభించారు. ఎటువంటి సూచీ బోర్డులు లేకపోవడంతో మొదటిరోజు విక్రయాలు నామమాత్రంగానే జరిగాయి. భక్తులకు, వాహనదారులకు తెలిసే విధంగా సూచీ బోర్డులు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

లోవకొత్తూరు శివారులో క్షుద్రపూజలు?

తుని రూరల్, జూలై 6: కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరు శివారులో సంచార వ్యక్తులు కొందరు క్షుద్ర పూజలు చేయడం కలకలం రేపింది. గ్రామ శివారులో అమావాస్య రోజు రాత్రి కొంత మంది వ్యక్తులు పూజలు నిర్వహించి దూడను బలి ఇవ్వడం సంచలనం రేకెత్తించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఒకరు వెళ్లి ప్రశ్నించగా మద్యం మత్తులో అతనిపై దాడికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్థులు అందరూ ఒక్కసారిగా అక్కడకు వెళ్లగా పూజలు నిర్వహించిన వారు పరారయ్యారు. విషయాన్ని రూరల్ పోలీసులకు తెలియపరచగా రూరల్ ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే ఎస్ఐ చెప్పిన వివరాలు ప్రకారం సంచార వ్యక్తులు అమావాస్య రోజున ఈ క్రమంలో పూజలు చేయడం ఆనవాయితీ అని తెలిపారని అయితే ఇవి క్షుద్ర పూజలు కాదని తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామస్తులు ఎటువంటి భయాందోళనకు గురికావద్దన్నారు.

- గేదెదూడను బలివ్వడంతో భయాందోళన
- ప్రశ్నించిన ఓ వ్యక్తిపై దాడికి ప్రయత్నం
- చుట్టుపక్కల వారు రావడంతో పరారీ



బలైన గేదెదూడ

శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



పెద్దాపురం, జూలై 6: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,78,140, అన్నదాన విరాళాలు రూ.52,616 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 5,720 తులాభారం రూ.200, లడ్డూ ప్రసాదం ద్వారా 19,620, కానుక ద్వారా 10 వేలు వెరసి రూ. 2,66,296 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్ల ఫలసాయం వేలం పాటలో ఉద్రిక్తత



జనాలను చెదరగొడుతున్న పోలీసులు

కె.గంగవరం, జూలై 6: కోట గ్రామ పంచాయతీ వద్ద శనివారం కొబ్బరి చెట్ల ఫలసాయం కోసం నిర్వహించిన బహిరంగ వేలం పాట ఉద్రిక్తతకు దారితీసింది. కోటిపల్లి - కాకినాడ ఆర్అండ్‌బీ రహదారి నుంచి కోట గ్రామం వరకూ ఉన్న జిల్లా పరిషత్ రహదారి వెంట ఉన్న కొబ్బరి మొక్కల ఫల సాయం తీసుకునే హక్కులకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. 7 బిట్‌లుగా విడదీసి పాటలు పెట్టారు. వీటిలో 1వ బిట్‌లో ఉన్న 325 మొక్కలు ఫలసాయం పాట విషయంలోనే వివాదం జరిగింది. గత కొంత కాలంగా ఈ మొక్కలు గ్రామంలోని జనిపెల్ల కృష్ణమూర్తి, పాము లక్ష్మణరావు కుటుంబాల ఆధీనంలో ఉన్నాయి. తమకు ప్రభుత్వం 30 సంవత్సరాల క్రితం చెట్టు పట్టా పథకంలో ఈ చెట్లు కేటాయించిందని, అప్పటి నుంచి తాము వీటిని సంరక్షించుకుని వీటి నుంచి వచ్చే ఫలసాయంతో జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొంత కాలం తాము వీటి పై ప్రభుత్వానికి పన్ను చెల్లించామని ఇప్పుడు పంచాయతీ వారు తమ దగ్గర నుంచి తీసుకుని వేలం నిర్వహిస్తే ఎలా అని నిలదీసారు. పాట నిలుపుదల చేయాలని గొడవ చేశారు. వేలం నిర్వహిస్తే తాము పురుగుల మందు సేవిస్తామని పురుగుల మందు డబ్బాలతో రెండు కుటుంబాలకు చెందిన మహిళలు హడావిడి చేశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో జరిగిన గలాటాలో పాటదారులు చెల్లించిన ధరావత్తు సొమ్ము చెల్లాచెదురైంది. పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పామర్రు ఎస్ఐ. కె.జానీబాషా ఆధ్వర్యంలో అదనపు పోలీసు బలగాలను రప్పించి వేలం నిర్వహించారు. మొత్తంగా 7 బిట్‌లకు పాట నిర్వహణ చేయగా నాలుగు బిట్లుకు పాటను ఖరారు చేశారు. రెండు బిట్లకు అప్‌సెట్ ధర రాకపోవడంతో వాయిదా వేశారు. మరో బిట్‌కు ఎవరు పాటకు ముందుకు రాలేదు. ఐతే వివాదానికి కారణమైన 1వ బిట్‌ను కొండేపూడి వీరబాబు రూ. 6,50,000 హెచ్చు పాటదారునిగా ఖరారు చేశారు. ఈవోపీఆర్‌డీ నాగేంద్ర పర్యవేక్షణలో కార్యదర్శి ఎస్. సుబ్బారావు వేలం పాటలు నిర్వహించారు. దీనిపై గ్రామ కార్యదర్శి వివరణ కోరగా ఈనెల 3వ తేదీన సర్పంచ్ మల్లిడి సుశీల అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి కొబ్బరి చెట్ల ఫలసాయంపై బహిరంగ వేలం నిర్వహణకు తీర్మానం చేశామన్నారు. అప్పుడు జనిపెల్ల కృష్ణమూర్తి, పాము లక్ష్మణరావు కుటుంబాల వారు ఇవి తమ ఆధీనంలో ఉన్నాయని చెప్పారని దానికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించాలని కోరామని, పాట రోజునైనా తీసుకురావాలని సూచించామని వారు ఏవిధమైన డాక్యుమెంట్లు చూపించలేదన్నారు.

హుండీల్లో నగదు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

గొల్లప్రోలు, జూలై 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని నగరపంచాయతీ షాపింగ్ కాంప్లెక్సులో గల వరసిద్ది వినాయకస్వామి ఆలయ హుండీల్లో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం తెల్లవారుజాము మధ్య సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు బద్దలుకొట్టి హుండీలను పగలకొట్టారు. అందులో ఉన్న సుమారు రూ.50 వేల నగదు చోరీ చేశారు. దీనిపై ఆలయ కమిటీ ప్రతినిధులు సిద్ధా వీరబాబు, ముమ్మిడి ఈశ్వరరావు, మాదేపల్లి నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు, క్లూస్ టీమ్ అధికారులు ఆలయం వద్దకు చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు.

మాజీ ఉపసర్పంచ్ డీవీఆర్‌పై దాడికి యత్నం

పోలీసుల తీరుపై ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం



స్వీటు షాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, జూలై 6: కొమరిపాలెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి మాజీ ఉప సర్పంచ్ ద్వారంపూడి వెంకటరెడ్డిపై కొందరు వ్యక్తులు దాడికి ప్రయత్నించి విఫలమైనట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. డీవీఆర్‌కు సంబంధం లేని ఓ స్వీట్ స్టాల్ అగ్ని ప్రమాదానికి గురైందని, అందులో 10 గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని అవి పేలితే మరింత ప్రమాదం జరుగుతుందని వెంటనే రావాలంటూ కొందరు అర్ధరాత్రి డీవీఆర్ ఇంటికి వెళ్లి చెప్పారన్నారు. ఆ సమయంలో ఆయన ఇంటి నుంచి బయటకు వస్తే దాడి చేయవచ్చునని ప్రత్యర్థుల పన్నాగమని చెప్పారు. అయితే ఆయన కిటికీలోంచే సమాధానం చెప్పి పంపడంతో ఆ ముప్పు తప్పిందన్నారు.

పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

ఈ విషయాన్ని టీడీపీ నేత మాజీ జడ్పీటీసీ పడాల రాము శనివారం తెల్లవారుజామున 4.30కు బిక్కవోలు ఎస్ఐకు తెలియజేసినా వారు ఇప్పటివరకూ సంఘటనా స్థలానికి రాకపోవడంపై ఎమ్మెల్యే పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ వారు వైసీపీ వారి ఇంటిపై రాయి వేశారని దొంగ ఫిర్యాదు చేస్తే ఎస్పీ నుంచి కింది స్థాయి పోలీసుల వరకూ స్పందించి తమ కార్యకర్తలను వేధించేవారన్నారు. ఈసంఘటనకు పాల్పడిన వారి కంటే దీని వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ పడాల రాము, డీవీఆర్, కూటమి నేతలు ఉన్నారు. ఈ సంఘటనపై స్వీట్‌స్టాల్ యజమాని ఖండవిల్లి విజయదుర్గ ఇచ్చిన ఫిర్యాదుపై స్టాల్‌ను స్వల్పంగా తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తుల మీద, డీవీఆర్ ఇంటికి అర్ధరాత్రి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తుల పైన దర్యాప్తు జరపాలంటూ ఇచ్చిన ఫిర్యాదులపైన రెండు కేసులు నమోదు చేశామని బిక్కవోలు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు.

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై మరమ్మతులు

రాజమహేంద్రవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఒకటో ప్లాట్‌ఫాంకి రైళ్ల రాకపోకలను నిలిపివేయనున్నారు. మే నెల 5న గూడ్సు రైలు రెండో ప్లాట్‌ఫాం ట్రాక్‌పై పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. దీంతో ఒకటి, రెండు ట్రాక్‌లకు పూర్తిగా మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. అదే నెల 16న రెండో ట్రాక్ మరమ్మతులను ప్రారంభించి గత నెల 18న పూర్తి చేశారు. ప్లాట్‌ఫాంపై టైల్సు వేసే పనులు ఆలస్యం కావడంతో మరి కొద్ది రోజులు సమయం పట్టింది. ప్రస్తుతం ఆ ట్రాక్‌పై ప్రయాణికుల, గూడ్సు రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయి. దీంతో ఒకటో ప్లాట్‌ఫాం ట్రాక్ పట్టాలను పూర్తిగా మార్చే పనిని చేయనున్నారు. దీని కోసం సోమవారం(9వ తేదీ) నుంచి సుమారు నెల రోజులపాటు ఈ ప్లాట్‌ఫాంకి రైళ్ల రాకపోకలు నిలిపివేసే అవకాశం ఉంది. అధికశాతం రైళ్లను రెండు, మూడు ప్లాట్‌ఫాంలపై నిలపనున్నారు. అవసరాన్ని బట్టి మూడు, నాలుగు ప్లాట్‌ఫాంలు కూడా వినియోగించనున్నారు. ఈ రెండు ప్లాట్‌ఫాంలపై ఇంకా షెడ్లు, బోగీల సంఖ్యలు తెలిపే సైన్ బోర్డులు లేకపోవడం గమనార్హం. వర్షాకాలం కావడంతో ఈ ట్రాక్‌లపై రైళ్లు నిలిపితే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది.



మంచు సోయగం



మోతుగూడెం, జూలై 6: చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. పొగ మంచుతో కొండలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

బాలబాలాజీ ఆదాయం రూ.2,26,516

మామిడికుదురు, జూలై 6: అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,26,516 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ జి.మాదవి తెలిపారు. శనివారం స్వామివారిని 2,841 మంది భక్తులు దర్శించుకున్నారని, 2,175 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



క్యూలో నిల్చున్న భక్తులు

రామచంద్రపురం మున్సిపల్ డీఈఈ గుండెపోటుతో మృతి



మండపేట/ద్రాక్షారామ, జూలై 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మున్సిపల్ డీఈఈ దుర్గాప్రసాద్ శనివారం గుండెపోటుతో షిర్డీలో మృతి చెందారు. దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా రెండు రోజుల క్రితం షిర్డీ వెళ్లారు. ఆయన శనివారం స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉండగా గుండెపోటు రావడంతో క్యూలైన్‌లోనే ప్రాణాలు విడిచారు. దుర్గాప్రసాద్ సమర్థవంతమైన అధికారిగా మంచి పేరుంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన సుదీర్ఘకాలం మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పనిచేశారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా, డీఈఈగా ఆయన ఇక్కడ పనిచేశారు. విజయవాడ నగర కార్పొరేషన్‌లో కూడా విధులు నిర్వర్తించారు. మండపేట నుంచి రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయానికి పదోన్నతిపై డీఈఈగా బదిలీ అయ్యారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, రెడ్డి రాజబాబు, మండపేట మున్సిపల్ డీఈఈ ఆర్.శ్రీనివాస్, మున్సిపల్ ఆర్ఐ ఐ.ప్రభాకరచౌదరి, మండపేట, రామచంద్రపురం మున్సిపల్ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

చేపల మృత్యువాత

ఆక్సిజన్ అందక చనిపోతున్న సముద్రపు చిన్న చేపలు



ఒడ్డున మృతిచెందిన చేపలు



యానాం, జూలై 6: యానాం గౌతమి గోదావరి నది ఒడ్డున సముద్రపు చేపలు మృత్యువాత పడి తేలాయి. సాయంత్రం చేపలు చనిపోయి ఒడ్డుకు చేరిపోవడంతో స్థానిక మత్స్యకారులు అక్కడికి చేరుకున్నారు. గోదావరిలో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల యానాం గోదావరికి చప్ప నీరు వస్తుందని, దీంతో ఆక్సిజన్ అందక సముద్రపు చిన్నసైజు చేపలు చనిపోయి ఒడ్డుకు చేరాయన్నారు.



కాకినాడ

నేడు సాహితీ స్రవంతి సభ

పోర్టుసిటీ (కాకినాడ), జూలై 6: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5గంటలకు గాంధీభవన్‌లో పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నామని సంస్థ నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ్ చౌదరి తెలిపారు. డాక్టర్ రెంటాల శ్రీవేంకటేశ్వరరావు కూనలమ్మ పదాలు, బంగారు తండ్రి పుస్తకాలను మంత్రి కృష్ణమోహన్, డాక్టర్ కాళ్లకూరి శైలజ సభకు పరిచయం చేస్తారని చెప్పారు. అనంతరం కవి సమ్మేళనం, కవితలు నిర్వహిస్తామన్నారు. సభలో ముఖ్యఅతిథిగా గనారా పాల్గొంటారని తెలిపారు.

రేపు పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పిఠాపురం, జూలై 6: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం పట్టణంలోని రథాలపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ తెలిపారు. సదరు కార్యక్రమానికి జిల్లాస్థాయి దిగువ అధికారులు, డివిజన్, నియోజకవర్గ స్థాయి అధికారులందరూ హాజరవుతారని చెప్పారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులు విన్నవించుకోవచ్చని వివరించారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ వేదిక జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కాగా కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌హాలు నందు ఆ రోజు యథావిధిగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లాస్థాయి అధికారులు అందరూ హాజరవుతారని చెప్పారు.

10న మండల కేంద్రాల్లో ఆందోళనలు

కాకినాడ సిటీ, జూలై 6: మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా కార్మికవర్గం పెట్టిన ఒక్క డిమాండ్‌నూ పరిష్కరించలేదని, ఏ పని చేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్లపై ఈనెల 10న అన్ని మండల కేంద్రాల్లో చేపట్టే ఆందోళనలు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సమావేశం కార్మికవర్గానికి పిలుపునిచ్చింది. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి సంఘ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకమైన 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని, నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అధిక ధరలు తగ్గించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని తదితర డిమాండ్లతో ఆందోళనలు తలపెడుతున్నామన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, వివిధ సంఘాల ప్రతినిధులు కె.సత్తిరాజు, మలకా రమణ, చంద్రమళ్ల పద్మ, నర్ల ఈశ్వరి, రొంగల ఈశ్వరరావు, ఎరుబండి చంద్రావతి, నందేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులపై కమిషనర్ అసహనం


సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 6: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముగ్గురు సచివాలయ కార్యదర్శులపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. శనివారం ఆయన పర్లోవపేట పావురాల తూము సమీపంలోని 10-బి సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, పనితీరు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను పర్యవేక్షించారు. ప్లానింగ్ సెక్రటరీ డ్రెస్ కోడ్‌ను ఉల్లంఘించి నందున, అందుబాటులోని లేని ఎమినిటీ సెక్రటరీకి షోకాజ్ నోటీసులు, పన్నుల వసూళ్లలో వెనుకబడ్డ సచివాలయ అడ్మిన్‌కు మెమో ఇవ్వాలని నిర్ణయించారు.

ప్రతీ విద్యార్థి నమోదు కావాలి : ఎంఈవో

సామర్లకోట, జూలై 6: పాఠశాలలో చేరే ప్రతీ విద్యార్థి యూడైస్‌వెబ్‌సైట్లో నమోదు కావాలని అందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిదే బాధ్యత అని సామర్లకోట ఎంఈవో పి.పుల్లయ్య పేర్కొన్నారు. మండలం, పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, యాజమాన్యాలకు యూడైస్ కార్యక్రమంపై శనివారం అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో సదస్సు నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ నమోదైన విద్యార్థుల వివరాలు వెబ్‌సైట్లో నమోదు కాకపోతే ప్రభుత్వం విద్యార్థులకు కల్పించే అన్ని రకాల సదుపాయాలు అందవన్నారు. మరో ఎంఈవో వై.శివరామకృష్ణయ్య మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి 18 ఏళ్ల గల చిన్నారులు, బడిబయట ఉన్న పిల్లలు పాఠశాలల్లో తప్పనిసరిగా నమోదు కావాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో పుల్లయ్య పరిశీలించారు.

'పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి'

గొల్లప్రోలు రూరల్, జూలై 6: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను తక్షణం పెంచాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు డిమాండ్ చేశారు. చేబ్రోలులో ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు డి.నారాయణమూర్తి అధ్యక్షతన శనివారం జరిగిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాలు అంతంత మాత్రంగానే ఉండటంతో వారు కుటుంబాలు పోషించుకోవడం భారంగా మారిందని ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. నాయకులు గుడాల చార్లిస్, కొరకంటి తాతీలు, పాపారావు, బోడపాటి నాగవిష్ణు, గుడాల సత్యనారాయణ పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమాలు నడపడమే లిబరేషన్ బాధ్యత'

ప్రత్తిపాడు, జూలై 6: ప్రజా ఉద్యమాలు నడపడమే సీపీఐ ఎంఎల్ లిబరేషన్ బాధ్యతని ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు చెప్పారు. లిబరేషన్ అనుబంధ సంస్థ అయిన అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం మండల సమావేశం శనివారం స్థానిక లిబరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా బంగార్రాజు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై దాడులు చేస్తుందని, ప్రజల సమస్యలు పట్టనట్లు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు పేరూరి లక్ష్మి, కె.జనార్ధన్, మానుకొండ లచ్చబాబు, గొల్లలక్ష్మి, విప్లవ యువజన సంఘం నాయకులు ఉన్నారు.

'మొక్కలు నాటడం సామాజిక బాధ్యత'

సర్పవరం జంక్షన్, జూలై 6: భావి తరాలకు కాలుష్య రహిత సమాజం అందించేందుకు మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకుని విరివిరిగా మొక్కలు నాటాలని అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ కోరారు. ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం తిమ్మాపురం క్యాంపస్ ఆవరణలో ఏక్ పెడ్ మాకే నామ్ అభియాన్ వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ స్టీఫెన్ వరప్రసాద్, డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ అప్పారావు, డాక్టర్ హారిక, డాక్టర్ గోపి,డాక్టర్ విజయశ్రీ ఉన్నారు.

'వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలి'

తుని రూరల్, జూలై 6: వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని తేటగుంట మెడికల్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాహితి తెలిపారు. మర్లపాడులో వైద్యశిబిరంలో ఆమె గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, కాచిచల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాంతులు, విరోచనాలు అయితే వెంటనే ఆరోగ్య కార్యకర్తలు,ఆశాకార్యకర్తలకు తెలియపరచాలని సూచించారు.

'జలాశయంలో చేపలవేట నిలిపివేయాలి'

సామర్లకోట, జూలై 6: పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి జలాశయంలో చేపలవేట నిలిపివేయాలని సామర్లకోట మున్సిపల్ కౌన్సిలర్లు నేతల హరిబాబు, పాగా సురేష్‌కుమార్, స్థానిక నాయకులు జీ.కృష్ణమూర్తి, వీ.సుధాకర్ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. సదరు జలాశయం పబ్లిక్ హెల్త్ పర్యవేక్షణలో ఉందన్నారు. ప్రస్తుతం సామర్లకోట పరిసరాల్లో డయేరియా వ్యాప్తిలో ఉన్నందున ప్రజారోగ్యాల దృష్ట్యా జలాశయంలో చేపలవేట నిలుపుదలకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌కు అందించిన వినతిలో కోరారు.

అన్నవరం వెళ్లిన టీడీపీ కార్యకర్తలు

సర్పవరం జంక్షన్, జూలై 6: రాష్ట్రంలో టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ రూరల్ నియోజకవర్గ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో శనివారం రమణయ్యపేట గైగోలుపాడుకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు శనివారం అన్నవరం స్వామి దర్శనానికి వెళ్లారు. సర్పవరం జంక్షన్ నుంచి అన్నవరానికి బయలుదేరిన పార్టీ కార్యకర్తల బృందం సభ్యులను బాబీ అభినందించారు. పార్టీ కోసం కష్టించిన కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన చెప్పారు.

యూటీఎఫ్ సంక్షేమ నిధి అందజేత

ప్రత్తిపాడు, జూలై 6: ప్రత్తిపాడులో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసి మృతి చెందిన విరుద సత్యనారాయణకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.3లక్షలు మంజూరు కాగా ఆ మొత్తాన్ని శనివారం స్థానిక మండల వనరుల కేంద్రంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జి. ప్రభాకర్ వర్మ, మండలాధ్యక్షుడు పోలి శ్రీనివాస్, ఎంఈవో వి.రాజబాబు బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు ఎంవీ సాయిరాం, పీవీవీ సత్యనారాయణ, జీవీ రమణ, ఆర్.రామలింగేశ్వరరావు, పోలి శ్రీను ఉన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

పిఠాపురం, జూలై 6: పిఠాపురంలోని మద్యం దుకాణంలో చోరీ జరిగింది. పిఠాపురం నుంచి కాకినాడ వెళ్లే మార్గంలో మద్యం దుకాణాన్ని శుక్రవారం రాత్రి ఉద్యోగులు మూసివేసి వెళ్లారు. శనివారం ఉదయం దుకాణం వద్దకు వచ్చేసరికి పై భాగంలో ఇనుప రేకు తొలగించి ఉంది. దుకాణం తెరిచి చూడగా 42 మద్యం ఫుల్‌బాటిళ్లు, పది బీరు బాటిల్స్ చోరీకి గురైనట్టు గుర్తించారు. షాపు వద్ద ఉండే సీసీ కెమెరాలను తొలగించి ఈ చోరీకి పాల్పడినట్టు చెబుతున్నారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు వచ్చి పరిశీలన జరిపారు. షాపునకు సెక్యూరిటీ సిబ్బంది ఉండగా చోరీ ఎలా జరిగిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేసిన వైద్యులు


సామర్లకోటలో పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం, కొత్తపల్లి: నాగులాపల్లిలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యుడు

సామర్లకోట, జూలై 6: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రాబీస్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా సామర్లకోట లయన్స్ భీమేశ్వరా క్లబ్ సౌజన్యంతో ప్రభుత్వ పశువైద్యశాలలో శనివారం సామర్లకోట వెటర్నరీ ఏడీ డాక్టర్ ఈ.ప్రమీల ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు ఇచ్చారు. ముఖ్య అతిథిగా తుమ్మల బాబు హాజరై ఏఆర్వీ వ్యాక్సిన్‌ను ఆవిష్కరించారు. వీబీఆర్ఐ జేడీ డాక్టర్ చంద్రమౌళి నాయక్, కాకినాడ ఏడీ డాక్టర్ పీవీఆర్.ప్రసాద్, డాక్టర్ ప్రమీల, డాక్టర్ భవాని పెంపుడు కుక్కలకు ఏఆర్వీ వ్యాక్సిన్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు చిత్తులూరి రాజా, ఈదర ఈశ్వరకుమార్, కానుబోయిన విజయకృష్ణ, గుండు శంకరరావు, కర్రి ఆదినారాయణ రెడ్డి, సేపేని సురేష్, పి.వెంకటరాజేశ్వరి, డాక్టర్ ఎన్ నిర్మలా కుమారి, కటకం గంగబాబు, ఎస్ఆర్‌వైవీఆర్ ప్రసాద్, తుమ్మల సత్యనారాయణ, కొర్లమండ శ్రీవాణి, బి.సీతారామరాజు పాల్గొన్నారు. సుమారు 200 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు.

ప్రత్తిపాడు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడులో పశుసంవర్ధకశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో యాంటీ ర్యాబీస్‌టీకాలను పశువక్షాలకు వేసేప్రక్రియను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పశువులు, జంతువుల ద్వారా మానవాళికి వ్యాప్తి చెందే అంటురోగాల అప్రమత్తంగా, అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కాల బాలచంద్రయోగేశ్వర్ మాట్లాడుతూ 690 యాంటీ ర్యాబీస్ డోస్‌లు, 18700 డోస్‌లు గొర్రెలతో వచ్చే నోటి వ్యాధులకు, 3200డోస్‌లు పశువులకు వచ్చే వ్యాధులకు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, జింకల తాతారావు, బొల్లు కొండబాబు, సూర్నీడి సురేష్, రావూరి తాతాజీ ఉన్నారు.

రౌతులపూడి: రౌతులపూడిలో పశువైద్యశాల నందు మండల పశువైద్యాధికారి ముద్రగడ వీర రాఘవరావు ఆధ్వర్యంలో 70 కుక్కలకు యాంటీ రాబీస్ టీకాలను వేశారు. సిబ్బంది గుల్లేపల్లి రమేష్, అపర్ణ, దివాణం, చిట్టిపాప తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఇళ్లల్లో పెంచుకునే కుక్కలకు ఏఆర్వీ తప్పనిసరిగా ఇంజెక్షన్ చేయించాలని కొత్తపల్లి, నాగులాపల్లి వెటర్నరీ వైద్యులు డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ సందీప్‌రెడ్డి తెలిపారు. కొత్తపల్లి, నాగులాపల్లి, కొమరగిరి వెటర్నరీ ఆసుపత్రులలో సుమారు 150 పెంపుడు కుక్కలకు ఆర్వీ ఇంజెక్షన్ చేశారు. ఆయా వెటర్నరీ ఆసుపత్రుల్లో వారం పాటు పెంపుడు కుక్కలకు ఏఆర్వీ ఇంజెక్షన్ చేస్తామన్నారు. రాజశేఖరరెడ్డి, రామ సుబ్బారెడ్డి సేవలందించారు.

తాళ్లరేవు: పత్తిగొంది పశువైద్యశాఖ ఆధ్వర్యంలో రేబీస్ వ్యాక్సిన్స్ కార్యక్రమాన్ని ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. చుట్టుపక్కల కుక్కలకు వ్యాక్సిన్స్ ఇచ్చారు. తాళ్లరేవు పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాయంలో ఏడీ బ్రహ్మవేద ఆధ్వర్యంలో ఉచిత రాబీస్ వ్యాక్సిన్ కుక్కలకు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైతుల ఫిర్యాదుతో ఎట్టకేలకు కదిలిన అధికారులు


రొయ్యల చెరువులు పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం రూరల్, జూలై 6: తమ సమీప ప్రాంతాల్లో సుమారు 60 ఎ కరాల్లో తవ్విన రొయ్యల చెరువులో తమ పంటపొలాలన్ని దెబ్బతిన్నాయని, పంటలు పండడంలేదని, రొయ్యల చెరువుల్లో వ్యర్థజలాలను పంటపొలాలు, కాలువల్లోకి విడుదల చేస్తున్నారని పిఠాపురం మండలం కోలంక రైతులు కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. పంటపొలాల మధ్య రొయ్యల చెరువు తవ్వకం సమయంలోనే రైతులు ఫిర్యాదు చేశారు. చెరువుల తవ్విన తర్వాత తాము పడుతున్న ఇబ్బందులపై గతేడాది ఫిబ్రవరిలో, తదనంతరం పలుమార్లు జిల్లా కలెక్టరుతో పాటు ఇతర అధికారలకు ఫిర్యాదు చేశారు. అయినా ఎవ్వరు పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంతో కలెక్టరు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్, మత్స్యశాఖ అధికారి రామకృష్ణ విచారణ చేపట్టారు. రొయ్యల చెరువులు, పంటకాలువలను పరిశీలించారు. రొయ్యలచెరువులకు సంబంధించిన కాలువలు, పంట కాలువలు కలిసి ఉన్నట్టు గుర్తించారు. నీటి శాంపిల్స్‌ను సేకరించారు. మట్టి నమూనాలను తీసుకున్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

చెందుర్తిలో లిబరేషన్ ర్యాలీ


చెందుర్తిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, జూలై 6: గొల్లప్రోలు మండలం చెందుర్తిలోని సర్వే నెంబరు1లో గల 450 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూములను ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్న పేదలకే వాటిపై సంపూర్ణహక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. లిబరేషన్ రాష్ట్ర నాయకుడు బుగతా బంగార్రాజు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఈ భూములను పశువధశాల, డంపింగ్‌యార్డు ఇతర అవసరాలకు లీజుకు ఇచ్చిందని, వాటికి వ్యతిరేకంగా కోర్టుల్లో పోరాడుతున్నామని చెప్పారు. వందల సంఖ్యలో నిరుపేదలు ఇక్కడ జీడిమామిడి తోటలు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కొందరు వ్యక్తులు పేదలకు ప్రలోభాలకు గురిచేసి ఈ భూములను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ వ్యవహారంపై దృష్టిసారించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లిబరేషన్ నాయకులు జనార్ధన్, కాకర రత్నకుమారి, నక్కా మంగమ్మ, శ్రీను తదితరులున్నారు.

ఉపాధి అవకతవకలపై నిలదీత

కరప, జూలై 6: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై జనసేన నాయకులు అధికారులను నిలదీశారు. జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెనుగుదురు పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ పథకం అధికారులు ఏర్పాటు చేసిన సమావేశానికి జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి విచ్చేసి గ్రామంలో జరిగిన ఉపాధి అక్రమాలపై అధికారులను ప్రశ్నించారు. గత వైసీపీ హయాంలో క్షేత్ర సహాయకురాలిని బెదిరించి దొంగ మస్తర్లతో డబ్బులు కాజేశారని ఆరోపించారు. ఈ అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఈజీఏస్ ఏపీవో జీవీ రమణకుమార్, టీఏ కె.ప్రకాష్, జనసేన నాయకులు తుమ్మలపల్లి మాచరరావు, గంటా నానిబాబు, వీఆర్వో ఎం.ఆదినారాయణ, కార్యదర్శి బి.చంద్రకళ పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగించండి!

రౌతులపూడి, జూలై 6: రౌతులపూడి శివాలయం వెనుక గల ఏటికాలువలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు పారక, సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువకు ఎగువ ప్రాంతమైన ఏజెన్సీ గ్రామాల మీదుగా సాగునీరు వస్తోంది. ఈ కాలువ కింద సుమారు 1200 ఎకరాల సాగుభూమి ఉంది. ప్రస్తుతం వర్షాలు కురవడంతో నారుమడులు వేసుకున్నారు. వాటిని తడిపేందుకు నీరులేక ఇబ్బందులు పడుతున్నారు. గుర్రపు డెక్కతొలగించాలని ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు.


ఏటికాలువలో పేరుకు పోయిన గుర్రపు డెక్క

మహోన్నత నేత జగ్జీవన్‌రామ్

ఘనంగా నివాళులర్పించిన నాయకులు


కాకినాడ సిటీ: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

కాకినాడ సిటీ, జులై 6: దళితులు ఉన్నత స్థానాలకు చేరేలా పాటుపడిన మహోన్నత నేత జగ్జీవన్‌రామ్ అని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పేర్కొన్నారు. భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అప్పారావు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సీకోటి అప్పలకొండ తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనా విధానంలో పయనిస్తూ దళితుల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ అనేక విధాలుగా పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారు సత్తిబాబు, దౌర్ల చిట్టిబాబు, దూళ్ల సత్యనారాయణ, జేవీవీ సత్యనారాయణ, సామంతుల రాజు, బుంగా నాగరాజు, సీకోటి ప్రసాద్, వానపల్లి పోలీసు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డోకుబుర్ర భద్రం మాస్టారు అన్నారు. దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్య వేదిక ఆధ్వర్యంలో అన్నమ్మఘాటీ సెంటర్ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. న్యాయవాది బండి నరేంద్ర, ఆవుపాటి ఉమాశంకర్, సాపే సుధాకర్, బి.బాలభద్రరావు పాల్గొన్నారు.

జీజీహెచ్(కాకినాడ): కాకినాడ లేడీస్ క్లబ్ సమీపంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. జగజీవన్‌రామ్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం 10గంటలకు సాంబమూర్తినగర్ 5వ వీధిలో దండోరా స్థూపంవద్ద జెండా ఆవిష్కరణ నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చాట్ల ఆశీర్వాదం, మిరియాల వీరబాబు, దూలపల్లి కృష్ణ, నురుకుర్తి ఫకీర్, డోకుబుర్ర ప్రసాద్, పువ్వల సత్యనారాయణ, కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

కరప: కరప పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా ఎస్సీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చాట్ల ఇమ్మానుయేల్, ఎస్సీ నాయకులు రాయి చిన్న, దార్ల శ్రీను, తాతపూడి శ్రీనివాసరావు, ఉండుర్తి ప్రకాశరావు, మంచాల శ్రీను ఉన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టెం వెంకటరమణ, నాయకులు పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ జనరల్ సెక్రటరీ రాతికింద వెంకట కృష్ణారావు, మోర్ప విజయబాబు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరందించేందుకు కృషి

ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు


మంచినీటి చెరువును పరిశీలిస్తున్న దాట్ల

తాళ్లరేవు, జూలై 6: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. శనివారం జి.వేమవరం రక్షిత మంచినీటి చెరువును ఎమ్మెల్యే అధికారులతో పాటు పరిశీలించారు. చెరువులో సింటుతీసి నీరుబయటకు తోడుటకు, చెరువుచుట్టు కంచె, సిమెంటువాల్ మరమ్మతులకు అంచనాలు తయారుచేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీదేవి, ఎఈ మారుతీరావులను ఆదేశించారు. ఒకసారి మరమ్మతులు చేపట్టిన తరువాత మళ్లీ అదే సమస్య పునరావృతమైతే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు అందించేందుకు ప్రతీపైసా నాణ్యతకే ఖర్చుచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపీటీసీ యర్రంనీడి అప్పారావు, ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు గండి అప్పారావు, టీడీపీ నేతలు శీకాల రాంబాబు, యర్రంనీడి అప్పలరాజు, శీకాల సత్తిబాబు, యర్రంనీడి గోవిందరాజులు, గండి మురళీకృష్ణ, జనసేన నేత గండి అనిల్ పాల్గొన్నారు. వైసీపీ వాళ్లు నా పింఛను తీసేసి అన్యాయం చేశారని, కొత్త ప్రభుత్వం పింఛను ఇప్పించి ఆదుకోవాలని జి.వేమవరానికి చెందిన పుణ్యమంతుల సత్యవతి (78) ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును వేడుకుంది. టీడీపీ నేతలు ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, గర్రే లక్ష్మీనారాయణ ఉన్నారు. జి.వేమవరంలో పంచాయతీ నిధులు రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

12 ట్రాలీ డస్ట్‌బిన్స్ బహూకరణ



కార్పొరేషన్ (కాకినాడ), జూలై 6: అఖిల భారత మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఓఎన్జీసీ సౌజన్యంతో కాకినాడ ఆర్టీసీ డిపోకి 12 ట్రాలీ డస్ట్‌బిన్స్‌ను శనివారం బహూకరించారు. కార్యక్రమంలో ఓఎన్జీసీ సీఎస్ఆర్ ఫండ్స్ ఇన్‌చార్జి అన్వర్, కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, కాకినాడ డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్, అఖిల భారత మహిళా సమాఖ్య సెక్రటరీ ఎన్.భానుమతి, ట్రెజరర్ పి.పద్మజావాణి, వైస్ ప్రెసిడెంట్ మీనాక్షి, మెంబర్స్ డాక్టర్ డిఆర్ ఉష, కె.పద్మజ, డి.శ్రీవల్లి, పీకే దుర్గాంబ ఉన్నారు.

మరిడమ్మ పండుగ

తుని రూరల్, జూలై 6: తేటగుంట శివారు గవరుపేటలో గ్రామ దేవత మరిడమ్మ పండుగ గ్రామస్తులు నిర్వహించారు. బోనాలు సమర్పించి జాతర నిర్వహించారు.


పిఠాపురంలో నివాళులర్పిస్తున్న బుర్రా కృష్ణంరాజు

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

పిఠాపురం, జూలై 6: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం పిఠాపురంలో నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో పిఠాపురం బీజేపీ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, పట్టణాధ్యక్షుడు అల్లుబోయిన సూరిబాబు, నాయకులు అడబాల వీరమోహనరావు, అద్దంకి పార్థసారథి, కర్నీడి తాతీలు, దంగేటి దొరయ్య, పెనుపోతుల సత్తిరాజు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పట్టణంలోని తహశీల్దారు కార్యాలయం సమీపంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ స్వచ్ఛభారత్ విభాగం రాష్ట్ర కో కన్వీనర్ బుర్రి మురళీధరరావు, తోట ఏడుకొండలు, పసుపులేటి సత్యనారాయణ, వరద బ్రహ్మజీ, ఈరంకి సూర్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏలేశ్వరం: పట్టణంలో బీజేపీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, యర్రవరంలో మండలాధ్యక్షుడు కూరాకుల రాజా నేతృత్వంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బండారు సూరిబాబు, బంధం అనిల్, గొడుగు నల్లబ్బాయి, యర్రమిల్లి గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరంలో ముఖర్జీ జయంతిని నిర్వహించారు. మండల బీజేపీ నాయకులు ఊటా వీరబాబు, ఆర్ఎస్ నారాయణ, ఎస్.శివ, నాని, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌కు ఎమ్మెల్యే నానాజీ శుభాకాంక్షలు


పుష్పగుచ్ఛం అంజేస్తున్న నానాజీ

సర్పవరం జంక్షన్, జూలై 6: రాష్ట్ర శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన జనసేన పార్టీకి చెందిన పిడుగు హరిప్రసాద్‌ను శనివారం విజయవాడలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పవన్ సూచనతో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేసిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎమ్మెల్యే


షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, జూలై 6: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సమీపంలో ఎంకే బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ షటిల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సీబీఎస్ఆర్సీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్, మాజీ సర్పంచ్‌లు యాళ్ల విశ్వేశ్వరరావు, మూర వరప్రసాద్,మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు చలంకూరి భాను, టీడీపీ నాయకులు అంబటి బుజ్జి, మదినే దొరబాబు, రాంబాబు, కురందాస్ అప్పలరాజు, రావూరి తాతాజీ తదితరులున్నారు.

'ఆలోచనా శక్తి పెంపొందించాలి'

ఏలేశ్వరం, జూలై 6: ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ఆలోచనా శక్తిని పెంపొందించాలని కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి చామంతి నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక భవితా కేంద్రం పరిధిలో ప్రత్యేక అవసరాల విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి విద్య, పిల్లల ప్రవర్తనతో పాటు ఎంఈవో కార్యాలయంలో విద్యార్థుల కిట్లు, రికార్డులు పరిశీలించి తల్లిదండ్రులకు పలు సూచనలిచ్చారు. చైతన్య నగర్, క్వారీపేటలో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల విద్యాప్రవేశం, నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈవో బి.అబ్బాయి, ప్రధానోపాధ్యాయులు డి.శ్రీను, వాణి పద్మజ, బుజ్జి తదితరులున్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

ప్రత్తిపాడు, జూలై 6: పాఠశాలల్లో నాడు-నేడు పనుల్లో భాగంగా టాయిలెట్స్ నిర్మాణ పనులు ముందుగా పూర్తిచేయాలని పెద్దాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో శనివారం ఎంఈవో పి.రాజబాబు అధ్యక్షతన మండల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాడు-నేడు పనులు వెనువెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈవో2 వై.అచ్చిరాజు ఉన్నారు.

'అంతర పంటలతో లాభం'

తుని రూరల్, జూలై 6: అంతర పంటలతో వ్యవసాయం లాభసాటి అవుతుందని డీఆర్‌సీ ఏడీఏ భ్రమరాంబ తెలిపారు. ఆమె స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి మండలంలో హంసవరంలో ప్రత్తిపంట పరిశీలించి పత్తిపంటలో అంతర పంట సాగుకు అవగాహన కల్పించారు. రాగులు పండించేందుకు రైతులు ముందుకురావాలని, ప్రభుత్వ సబ్సిడీతో విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట ఏవో అశోక్‌కుమార్ ఉన్నారు.

'ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి'

జేఎన్టీయూకే, జూలై 6: ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, తద్వారా వర్సిటీ ప్రాంగణమంతా పచ్చదనంతో ఉండేలా కృషి చేయాలని జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ అధికారులు మొక్కలు నాటారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు

ప్రత్తిపాడు, జూలై 6: జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను మండలంలో ధర్మవరం గ్రామ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. మండలంలో ఉన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఊటా వీరబాబు, రామకుర్తి సూర్యనారాయణ, సిద్ద శివ, ఉలవల నాని, రామిరెడ్డి గంగాధర్, నాయనపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

'పల్లా'ను కలిసిన టీడీపీ నేతలు

రౌతులపూడి, జూలై 6: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును మండల గిరిజన టీడీపీ నేతలు కలిశారు. టీడీపీ ఎస్టీసెల్ నాయకుడు ఈగల సత్తిబాబు, రాఘపట్నం సర్పంచ్ రాయపల్లి పోతురాజు, యువనేతలు లోవరాజు, దుర్గా విజయవాడలో పల్లాను మర్యాద పూర్వకంగా కలిశారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, జూలై 6: గోకవరం మండలం కామరాజుపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన వీరవల్లి విష్ణుకుమారుడు వీరవల్లి శ్రీనివాస్‌ను జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. గోకవరం మండలం ఉపాధ్యక్షులు గవిని దుర్గాప్రసాద్, పదిల మురళీకృష్ణ, గోకవరం టౌన్ కన్వీనర్ పదిలం మురళీకృష్ణ తదితరులున్నారు.

కొండయ్యదొర వర్ధంతి

గండేపల్లి, జూలై 6: టీడీపీ నేత కందుల కొండయ్యదొర 4వ వర్ధంతి సందర్భంగా మురారిలో టీడీపీ కార్యాలయం వద్ద, బ్రహ్మలగుడి వద్ద ఉన్న కొండయ్యదొర విగ్రహాలకు కందుల కుటుంబీకులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 400మంది పింఛన్ మహిళలు, వృద్ధులకు చీరలు, స్వీట్‌బాక్సులు అందజేశారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, టీడీపీ నాయకులు కోర్పు లచ్చయ్యదొర, పోతుల మోహనరావు, జాస్తి వసంత్, కంటే సురేంద్ర, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఎస్.రాజు ఉన్నారు.